ప్రజాశక్తి
మంగళవారం 5 సెప్టెంబర్ 2023

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతిత్రం అందజేస్తున్న సిపిఎంజిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

నేడు జిల్లాకు చంద్రబాబు

- మూడు రోజులపాటు పర్యటన
- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో హాజరు
- మూడు నియోజకవర్గాల సమీక్ష



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం నుంచి మూడు రోజులపాటు అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. 'భవిష్యత్‌కు బాబు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొంటారు. అదే సమయంలో నియోజకవర్గాల సమీక్షలు కూడా ఉండనున్నట్టు తెలుస్తోంది. మంగళవారం ఉదయం బళ్లారికి విమానంలో చేరకుంటారు. బళ్లారి నగరంలో కమ్మమహాజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. తరువాత కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని ఓబుళాపురం చెక్‌పోస్టు వద్దకు చేరుకుంటారు. వేదవతి మీదుగా పల్లేపల్లి మీదుగా రాయదుర్గం చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటలకు తేరు సెంటర్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. రెండో రోజు బుధవారం ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభమవుతుంది. కణేకల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి ఉరవకొండలోని కౌకుంట్ల గ్రామంలో జరిగే ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. అనంతరం ఒంటిమిద్ది మీదుగా కళ్యాణదుర్గం నియోజకవర్గం చేరుకుంటారు. సాయంత్రం 4.15 గంటలకు టి.సర్కిల్‌లో రోడ్డు షోలో పాల్గొంటారు. వాల్మీకి సర్కిల్ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. మూడవ రోజు పర్యటన కళ్యాణదుర్గంలో ప్రారంభమవుతుంది. మహిళా ప్రగతి కోసం వేదిక అన్న అంశంపై చర్చ ఉండనుంది. మధ్యాహ్న భోజన విరామం తరువాత పామిడిలో వస్త్ర కార్మికులతో మాట్లాడుతారు. గుత్తి సర్కిల్ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడితో చంద్రబాబు మూడు రోజుల పర్యటన ముగియనుంది. అనంతపురం నుంచి కర్నూలు జిల్లాలోకి ప్రవేశిస్తారు.

నియోజకవర్గాల సమీక్షల్లో దిశానిర్దేశం

భవిష్యత్‌కు గ్యారెంటీ యాత్ర సందర్భంగా మూడు నియోజకవర్గాల్లో బాబు పర్యటన సాగనుంది. ఈ సందర్భంగా నియోజకవర్గాల సమీక్షలు సైతం నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. ఈ సమీక్షలతోనైన టిడిపి నేతలు ఏకతాటిపైకి వస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది. ప్రధానంగా అందరి దృష్టి కళ్యాణదుర్గం నియోజకవర్గంపై ఉంది. 2019 ఎన్నికలకు ముందు నుంచి ఇక్కడ గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికీ గ్రూపు తగాదాలు నడుస్తూనే ఉన్నాయి. బాబు పర్యటన జరుగుతున్న ఈ సమయంలోనూ ఆ పార్టీ నేతలు విడివిడిగానే సమావేశాలు జరుపుతున్నారు. దీంతో అప్రమత్తమైన జిల్లా నేతలు ఇరు వర్గాలకు సర్ధిజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి ఏ మేరకు కొలిక్కొ వస్తాయన్నది చూడాల్సి ఉంది. గతంలో యువగళం పాదయాత్ర సందర్భంలోనూ నేతల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఈసారి అటువంటి తలెత్తకుండా ఉండే విధంగా జిల్లా నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇక గుంతకల్లు నియోజకవర్గంలోనూ నేతల మధ్య సఖ్యతలేదు. పార్టీ కార్యక్రమాలు ఇక్కడ అంతంత మాత్రంగానే నడుస్తున్నాయి. మూడు నియోజకవర్గాల సమీక్షల్లో ఏ రకమైన మార్గనిర్ధేశం ఇస్తారోనన్నది కూడా ఆసక్తికరంగా మారింది.

సమస్యలపై 'సమరభేరి'

- జిల్లా వ్యాప్తంగా సిపిఎం నిరసనలు
- తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేత
- ప్రజాసమస్యలను పరిష్కరించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం

ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పంటనష్టపోయిన రైతులకు పరిహారం, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, విద్యుత్‌కోతల నివారణ, ధరల నియంత్రణ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సమరభేరి నిరసనల్లో భాగంగా సోమవారం నాడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నాయకులు ఎండగట్టారు. కళ్యాణదుర్గంలో జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పాల్గొని ప్రసంగించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజలతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార అక్కడ బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావంతో పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల ప్రకారం పంటనష్టపరిహారం అందించాలన్నారు. జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. 88 సంవత్సరాల తరువాత ఆగస్టు నెలలో అతితక్కువ వర్షపాతం ఈ ఏడాది నమోదు అయ్యిందని చెప్పారు. ప్రతి ఏడాదీ 9.22 లక్షల ఎకరాల్లో విత్తన సాగు జరుగుతుండగా వర్షాభావంతో ఈ ఏడాది కేవలం 5.62లక్షల ఎకరాల్లో మాత్రమే విత్తనాలు సాగుచేశరని చెప్పారు. వేసిన పంటకూడా ఎండలకు ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు హెచ్ఎల్‌సి ద్వారా నీటిని విడుదల చేస్తే నిర్వాహణలోపం కారణంగా 12రోజుల్లో మూడు సార్లు గండిపడిందన్నారు. చాలా మంది రైతులు పంటలు పండించే అవకాశం లేకపోయిందన్నారు. మరో వైపు ప్రకృతి ప్రకోపం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అడపాదడపా నీరున్న రైతులు బోరుబావుల కింద పంటలు సాగు చేస్తే వేళాపాళలేని విద్యుత్ కోతల కారణంగా ఆ పంటలు కూడా చేతికందే పరిస్థితులు లేవన్నారు. ఈ సమస్యలపై పాకులు మొద్దు నిద్రవీడి ప్రజలకు అండగా నిలవాలని కోరారు. అనంతరం తొమ్మిదిగంటల విద్యుత్, ప్రజాపంపిణీ ద్వారా కందిపప్పు, నూనె అందజేత, నిరుద్యోగులకు జాబ్‌క్యాలెండర్, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ, పెరిగిన ధరల తగ్గింపు, విత్తనం సాగు చేయని రైతులకు రూ.30వేలు, రూ.400కే గ్యాస్‌సిలిండర్ తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇన్‌ఛార్జి తాహశీల్దార్ ఫణికుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు రంగనాథ్, వంశీ, రఘు, అశోక్, ఈశ్వర్, సోము, భవిత్, మురళి, అంజినేయులు, అమానుల్లా, సిద్ధా, వెంకటేశ్, ఇస్మాయిల్, రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతిమి

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు నాణ్యతగా పరిష్కారం చూపించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్‌ను అర్జీదారులు 100 శాతం సంతృప్తి చెందేలా పరిష్కరించడం సవాలుతో కూడుకున్న అంశమన్నారు. నార్పల, శింగనమల, వజ్రకరూరు తదితర మండలాల్లో సంతప్తి స్థాయి తక్కువగా ఉందని, ఆయా మండలాల అధికారులు దీనిపై దృష్టి సారించాలని చెప్పారు. సంతృప్తి స్థాయి తక్కువ ఉన్న శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భూమి, ఆర్ఒఆర్, రహదారి సమస్యలను సర్వే, రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. అర్జీదారుడితో వ్యక్తిగతంగా మాట్లాడకుండా పరిష్కారం చూపించరాదని, వారితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. ఆయా మండలాల ప్రత్యేక అధికారులు ప్రతి బుధవారం సమావేశం నిర్వహించి సమస్యలు ఏమైనా ఉంటే జిల్లా అధికారుల దష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, డిఆర్ఒ గాయత్రీ దేవి, ఆర్డీవో మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, నీలమయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమనేతకు తుదివీడ్కోలు

- ధర్మవరంలో పోలా రామాంజినేయులు అంత్యక్రియలు
- తరలివచ్చిన వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు
- నివాళులు అర్పించిన చేనేత కార్మికులు
- 'జోహార్ పోలా రామాంజినేయులు' అంటూ నినాదాలు

పోలా రామాంజినేయులు అంతిమయాత్రలో పాల్గొన్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత ఉద్యమ నేతకు తుదివీడ్కోలు పలికారు. అనారోగ్య సమస్యలతో ఆదివారం నాడు తుదిశ్వాస విడిచిన ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు పోలా రామాంజినేయులు అంత్యక్రియలను ధర్మవరంలో సోమవారం నిర్వహించారు. చేనేత కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన ఆయన్ను తుదిసారి చూసేందుకు పెద్ద సంఖ్యలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నాయకులు తరలొచ్చారు. ఎర్రజెండాను ఆయన భౌతికకాయంపై ఉంచి నేతలు నివాళులు అర్పించారు. రామాంజినేయులు స్వగృహం నుంచి ప్రారంభం అయిన అంతిమయాత్ర బత్తలపల్లి రోడ్డులోని శ్మశానవాటిక వరకు కొనసాగింది. 'జోహార్ పోలా రామాంజి నేయులు.. జోహార్.. జోహార్" అంటూ అంతిమ యాత్రలో నాయకులు, కార్మికులు నినదించారు.

పోలా రామాంజినేయులు భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ధర్మవరంలోని ఆయన నివాసం వద్ద ఉంచారు. ఉదయం 9 గంటలకు ఆయన ఇంటి నుంచి అంతిమ యాత్రను ప్రారంభించారు. సిపిఎం, సిపిఐతో పాటు వివిధ పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పోలా రామంజినేయులు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, జిల్లా నాయకురాలు దిల్షాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దన్న, సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నాయకులు జింకాచలపతితో పాటు పలువురు నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్రనాయకులు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి ఇంతియాజ్‌లు పోలా రామాంజినేయులు పాడెమోశారు. చేనేత కార్మికులు, ప్రజల నడుమ దిమ్మెల సెంటర్, తేరుబజార్, అంజుమాన్ సర్కిల్, కాలేజ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, గాంధీనగర్ సర్కిల్, పట్టణ పురవీధుల్లో అంతిమ యాత్రను నిర్వహించారు. బత్తలపల్లి రోడ్డులోని శ్మశానవాటికలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. అంతిమయాత్ర మొదలు నుంచి చివర వరకు పోలా రామాంజినేయులు జోహార్లు పలికారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న, బడా సుబ్బిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, ఆదినారాయణ, సిఐటియు అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, సిపిఎం నాయకులు ఎస్‌హెచ్.బాషా, కదిరి నాయకులు నరసింహులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జెవి రమణ తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

ధర్మవరంలో సాగుతున్న పోలా రామాంజినేయులు అంతిమయాత్ర

బందార్లపల్లి కొండల్లో చిరుత సంచారం

భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల పరిధిలోని బందార్లపల్లి గ్రామంలో గత కొంతకాలంగా చిరుత సంచారం కలకలం రేపుతోంది. గ్రామం సమీపంలో కొండ ప్రాంతాలల్లో చిరుత తిరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గత వారం రోజుల క్రితం పడవకొండ ప్రాంతంలో గొర్రెలను మేపుకోవడానికి వెళ్లిన వారిపై చిరుత దాడి చేయడానికి ప్రయత్నించడంతో వారు అక్కడి నుంచి పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. దుర్గం కొండ వద్ద శ్రీనివాసులు అనే రైతు వ్యవసాయ పనులు చేసుకొంటూ ఉండగా ఎద్దులపై చిరుత దాడి చేయడానికి ప్రయత్నించింది. అప్రమత్తమైన రైతు తన ఎద్దులతో అక్కడి నుంచి తప్పించుకుని కొండకు దూరంగా వచ్చాడు. చిరుత సంచారంతో చాలా మంది మహిళలు పొలాలకు పనులకు పోవాలంటే ప్రాణభయంతో కొండ వైపు వెళ్లడం లేదు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత సంచరించే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తూ చిరుత బారి నుంచి కాపాడాలన్నారు.

కొండలో సంచరిస్తున్న చిరుత

విద్యార్థినులకు అస్వస్థత

నార్పల బాలికల హాస్టల్‌లో ఘటన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని బాలికల హాస్టల్‌లో సుమారు 15 మంది విద్యార్థినులు సోమవారం అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. వీరందరికీ నార్పల ప్రాథమిక వైద్యశాలలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అయితే వీరిలో ఇద్దరు విద్యార్థినులకు కడుపులో మంట ఎక్కువగా ఉండటంతో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా వైద్యులు సాదియా, ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు కల్తీ ఆహారం తిని కడుపు మంట వచ్చిందా.. మరో కారణమా.. అని ఖచ్చితంగా చెప్పలేమన్నారు. అయితే హాస్టల్లో ఫుడ్ పాయిజన్ అయిందా.. అని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చాలామంది హాస్టల్ పిల్లలు సీజనల్ వ్యాధులైన దగ్గు, పడిసం, జ్వరం తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయస్సు పొడిగింపు

జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానిక జెఎన్‌టియులో పని చేసే అధ్యాపకుల పదవీ విరమణ వయస్సు 65ఏళ్లకు పొడిగిస్తూ పాలకమండలి ఆమోదం తెలిపినట్లు ఉపకులపతి రంగజనార్ధన తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవన్‌లోని ఉపకులపతి ఛాంబర్‌లో నూతన పాలక మండలి సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ఆన్‌లైన్ లో పాల్గొనగా పాలక మండలి సభ్యులు ఆన్‌లైన్ ద్వారానే పదవీ బాధ్యతలు స్వీకరించారు.

మాట్లాడుతన్న విసి రంగజనార్ధన

ఎపిఐఐసి జోనల్ మేనేజర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సువనసోనీని సోమవారం నగరంలోని కార్యాలయంలో అనంతపురం, గుత్తి ఐలా పారిశ్రామికవేత్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్తలు మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉన్న అధికారిణి జోనల్ మేనేజర్‌గా జిల్లాకు రావడం శుభపరిణామం అన్నారు. అనంతరం సువన సోనీ మాట్లాడుతూ తనకూ జిల్లాకూ విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తాను ఇక్కడ క్లర్కు స్థాయి నుంచి ఈ స్థాయి వరకూ పని చేసిన అనుభవం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలు, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ నాగార్జునరావు, సిబ్బంది బాలచంద్రగౌడ్, రామాంజి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సువనసోనీని అనంతపురం, గుత్తి ఐలా పారిశ్రామికవేత్తలు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయనంద్

నిరుద్యోగ సమస్యపై రాజీలేని పోరాటాలు

మాజీ ఎమ్మెల్సీ గేయనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్సీ గేయనంద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సాయి గంగా కోచింగ్ సెంటర్లలో డివైఎఫ్ఐ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 35ఏళ్లలోపు యువత 65 శాతం ఉన్నారన్నారు. అలాంటి యువతకుఉద్యోగ, ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. డిగ్రీలు, పీజీలు చదివి కూలి పనులకు వెళ్తున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం తప్ప దేశ ప్రజల కష్టాలు తీర్చడానికి పని చేయడం లేదన్నారు. మోడీ సర్కార్ లేబర్ కోడ్‌లు తెచ్చి కార్పొరేట్లకు రక్షణ కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ అధ్యాపక పోస్టుల భర్తీకి కృషి చేయాలన్నారు. గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులు లక్షల సంఖ్యల్లో ఖాళీలు ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. మరోవైపు సైన్యంలో రిక్రూట్మెంట్ కోసం యువత ఎదురు చూసిన తరుణంలో అగ్నిపథ్ తీసుకొచ్చి ఆశలను ఆవిరి చేసిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. లేనిపక్షంలో ప్రభుత్వాలు యువత పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా యువకులు పోరాటాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట

- క్రిటికల్ కేర్‌సెంటర్‌కు శంకుస్థాపన
- ఎంపి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధికారంలోకి వచ్చాక సిఎం జగన్ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని ఎంపి తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద 50 పడకల సామర్థ్యంతో రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదవాడికి జబ్బు చేస్తే ముందుగా చూసేది ప్రభుత్వ ఆస్పత్రుల వైపే అన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగాన్ని బలోపేతం చేస్తున్నాయన్నారు. ముఖ్యంగా సిఎం జగన్ ఇప్పటికే నాడు-నేడు కింద రూ.300కోట్లతో సర్వజనాస్పత్రి విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇందుకోసం ఆర్అండ్‌బి, ఇరిగేషన్‌కు సంబంధించి స్థలాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇక్కడ ఏడురకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, 500కుపైగా మేజర్, మైనర్ ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు సర్వజనాస్పత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గతంలో వైద్య చికిత్సల కోసం కర్నూలు, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లే పరిస్థితి ఉండేదని, కానీ ఇక్కడ కూడా క్రిటికల్ కేసులకు చికిత్స అందుతోందన్నారు. ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తాజాగా శంకుస్థాపన చేసిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఎనిమిది నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఇతర వైద్యులతో సమావేశమయ్యారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం వద్దని ఎమ్మెల్యే అనంత సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దష్టికి తీసుకురావాలని, అందరూ సమిష్టిగా పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఆర్ఎంఒ పద్మజ, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్యకుమార్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ మహబూబ్, డిఇ శ్రీనివాసులునాయుడు, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజని, కార్పొరేటర్ సంపంగి రామాంజినేయులు, వైసిపి మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్‌సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

'సమరభేరి'లో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

పంటలు దెబ్బతిన్న, పంటలు సాగు చేయని రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టపరిహారం మంజూరు చేయాలని, 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. హెచ్ఎల్సి కాలువ ఆధునీకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే రాచేపల్లి లిడ్ క్యాప్ పరిశ్రమ ఓపెన్ చేసి శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి కల్పించాలని, భూమిలేని కుటుంబాలకు కుటుంబానికి మూడెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, ఆనందరావుపేట ఆంజనేయులు, శ్రీనివాసులు, పుల్లన్న, రామారావు, ముత్యాలు, ఆంజనేయులు, వెంకటనారాయణ, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు, సాగు చేయని రైతులకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, రూ.400కే గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, మండల నాయకులు టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, పృథ్వీ, రఘువీరా, రాజు, కుళ్లాయప్ప, ఓబులేసు, రమేష్, లక్ష్మయ్య, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివశంకర మాట్లాడుతూ సకాలంలో వర్షాలు రాకపోవడంతో జిల్లాలో సాధారణ సాగు 9.60 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి ఉండగా కేవలం ఐదు లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైందన్నారు. కావున నష్టపోయిన రైతులతోపాటు పంట సాగు చేయని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ [illegible] వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రామయ్య, ఆవాజ్ నాయకులు వలి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జయమ్మ, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి రాజేశ్వరమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప మాట్లాడుతూ పంటలు సాగు చేసి ఎండిపోయిన రైతులకు కనీసం ఎకరాకు రూ.50వేలు, విత్తనం వేయలేని రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఎస్.రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సి.నాగేంద్ర, పి.పుల్లయ్య, చెన్నప్ప, నెట్టికంటయ్య, ఎ.నాగలింగమయ్య, సంజీవరెడ్డి, అంకాలు, రాజు, ఎర్రన్న, రాముడు, గంగన్న, సంజీవరెడ్డి, పుల్లయ్య, నెట్టికల్లు, సిఐటియు నాయకుల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాళ్ : మండలంలో సకాలంలో వర్షాలు కురవక నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ లోకేష్ మాట్లాడుతూ రైతులు రూ.లక్షలు వెచ్చించి పంటలు సాగు చేస్తే సకాలంలో వర్షాలు రాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఆపైకి కరెంటు కోతల కారణంగా బోర్ల కింద కూడా పంటలు ఎండిపోతున్నాయన్నారు. వీటితోపాటు ప్రజలు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, లింగన్న, నాగరాజు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలు సాగు చేశారన్నారు. అయితే వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. కావున వెంటనే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ డి.ఓబులేసుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కనీసం 40 శాతం కూడా వ్యవసాయం సాగు చేయలేని దుస్థితి దాపురించిందన్నారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచడంతోపాటు, పట్టణాల్లో కూడా అదే తరహాలో కల్పించాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, మండల కార్యదర్శివర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, భీమప్ప, చొక్కా సునీల్, చంద్రన్న, జాకీర్, షాషా, మహిళా నాయకురాలు జ్యోతి, లక్ష్మీబాయి, సులోచన, నాగలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమలలో తహశీల్దార్ ఈశ్వరమ్మకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుత్తి : సమరభేరి కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, పెట్రో ధరలు, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని, సహాయ కార్యదర్శి వెంకటలక్ష్మి, సునీత, రామలక్ష్మి, బాలగిరి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

పెద్దవడుగూరు : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు సమస్యలపై తహశీల్దార్ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, సహాయ కార్యదర్శి మదిలేటి, రైతుసంఘం మండల అధ్యక్షులు నాయకులు ఈశ్వర్‌రెడ్డి యాదవ్, చేనేత సంఘం మండల అధ్యక్షులు వన్నూరువలి నాయకులు రామచంద్ర, చిరంజీవిరెడ్డి, ఈశ్వరమ్మ, సుశీలమ్మ, నారాయణస్వామి, రంగనాయకులు, చేనేత కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ, కార్మిక సంఘం కార్యదర్శి రంగస్వామి, సహాయ కార్యదర్శి హరిగోపాల్, శివయ్య, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : వర్షాభావం కారణంగా పంటలు సాగు నష్టపోయిన రైతులకు రూ.50 వేలు అందించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ వర్షాభావంతో పంట సాగు చేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఉషారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శంకర, ఇస్మాయిల్, రాముడు, నాగార్జునరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటరాముడు, వన్నూరు, లక్ష్మీదేవమ్మ, కిష్టయ్య, నాగముని, రవీందర్‌రెడ్డి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం నియోజకవర్గంలోని వజ్రకరూరు, కూడేరు, ఉరవకొండ మండల కేంద్రాల్లోని తహశీల్దార్ కార్యాలయాల ముందు ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. వివిధ సమస్యలను పరిష్కరించడంతోపాటు ఖాళీగా ఉన్న గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ, వజ్రకరూరు మండలాల కార్యదర్శులు మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు సీనప్ప, సిద్ధప్ప, మురళి, వీరాంజినేయులు, రవి, వినోద్, వెంకటేష్, కరీంసాబ్, మల్లికార్జున, చిన్న ఈశ్వరయ్య, నారాయణరెడ్డి, చిదంబరమ్మ, సుంకమ్మ, అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన నారాయణస్వామి కుటుంబ సమస్యలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

కేబుల్ వైర్ చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు సంబంధించిన కేబుల్ వైర్ చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డికి చెందిన తోటల్లో ఉన్న షెడ్డులో ఉంచుకున్న కేబుల్ వైర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు రైతులు వాపోయారు.

పేకాటజూదరులు అరెస్టు

తాడిపత్రి రూరల్ : పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి 13 మందిని సోమవారం అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో రూరల్ సిఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌మహమ్మద్ సిబ్బందితో కలిసి రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు, ఆర్‌డిటి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న రంగనాయకులు, మస్తాన్, శీనాతోపాటు మరో 10 మందిని అరెస్టు చేసి రూ.3,15,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

బుక్కరాయసముద్రం : చిరుధాన్యాల పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ సహదేవరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని రేకులకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పెసర, ఉలవ, జొన్న, అలసంద, అనప, రాగి, తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. ఇకపోతే ఇప్పటికే సాగ చేసిన ఆముదం పంటకు ఎకరాకు 15 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. అలాగే బెట్ట కొట్టిన వేరుశనగ పంట ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కోలుకోవాలంటే 19-19 కానీ, పొటాషియం కానీ లీటరు నీటికి 5 ఎంఎల్ ఫిసికల్ కలుపుకుని చల్లాలన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : తుఫాన్ ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మేయర్ మహమ్మద్ వసీం అధికారులను సూచించారు. సోమవారం నగరంలోని 37, 43, 45వ డివిజన్లలో మేయర్ వసీం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం నీరు రోడ్లపై వచ్చే ప్రాంతాల్లో కాలువలలోకి నీరు వెళ్లేలా చూడాలని సూచించారు. అదేవిధంగా డ్రెయినేజీల్లో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు ఇషాక్, అనిల్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శ సంగం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మట్టి విగ్రహాలపై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాల వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో చేసిన విగ్రహాలను ప్రతిష్టించి ఆ తర్వాత నీటిలో నిమజ్జనం చేయడం వల్ల రసాయనాలు నీటిలో కరిగి ఎన్నో అనర్థాలు దాపురిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

నార్పల : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్ర వాహనదారులందరూ ఎక్కడైనా ప్రయాణం చేసేటప్పుడు తప్పకుండా హెల్మెట్ వాడితే అదే మీ ప్రాణాలను కాపాడుతుందన్నారు.

బాలాపురంలో జెసి.ప్రభాకర్‌రెడ్డి పర్యటన

పుట్లూరు : మండల పరిధిలోని బాలాపురం గ్రామంలో తాడిపత్రి మున్సిపల్ ఛైర్‌పర్సన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకుడు బి.రామచంద్రారెడ్డి ఇంటి ముందు ఉన్న మరుగుదొడ్డిని వైసిపి నాయకులు ఆదివారం జెసిబి సాయంతో తొలగించారు. విషయం తెలుసుకున్న జెసి ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఉదయం రామచంద్రారెడ్డి ఇంటికి చేరుకుని పరిశీలించారు. ఆయనతోపాటు తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఓబులాపురం శ్రీనివాసులునాయుడు, చెర్లోపల్లి రవికుమార్‌నాయుడు, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, పుల్లారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తదితరులు ఉన్నారు.

సనపలో మహాశక్తి చైతన్యయాత్ర

ఆత్మకూరు : మండలంలోని సనప గ్రామంలో సోమవారం టిడిపి నాయకులు మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే మహిళల కోసం అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీదేవమ్మ, హిందూపురం పార్లమెంట్ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ, పెద్ద లక్ష్మీదేవి, మంజుల, మాధవి, రామాంజనమ్మ, అనిత, అలివేలమ్మ, ధనలక్ష్మి, చెన్నమ్మ, వరలక్ష్మి, హేమలత, అక్కమ్మ, మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, సోషల్ మీడియా అధ్యక్షుడు బిల్లే బాల ఉజ్జినప్ప, తదితరులు పాల్గొన్నారు.

లచ్చానుపల్లి ఉప సర్పంచిగా సుగుణమ్మ

గుత్తి : మండలంలోని లక్షానుపల్లి ఉప సర్పంచిగా వైసీపీ మద్దతురాలు సుగుణమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లచ్చానుపల్లి 7వ వార్డు సభ్యుడు కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతిచెందాడు. ఎన్నికల నోటిఫికేషన్‌లో భాగంగా ఆస్థానంలో కృష్ణమూర్తి భార్య సుగుణమ్మ వార్డు సభ్యురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచి ఎన్నికలు జరిగాయి. వార్డు సభ్యులందరూ సుగుణమ్మను ఉపసర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శివాజీరెడ్డి, సర్పంచి ఎం.గోపాల్ ఆమెకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి

బొమ్మనహాల్ : టిడిపి అధినేత చంద్రబాబు రాయ దుర్గంలో పర్యటించనున్నారని, మండల వ్యాప్తం గా టిడిపి శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని మండల కన్వీనర్ బలరామిరెడ్డి కోరారు. స్థానిక ఉప్పరాల గేటులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు రాయదుర్గం వస్తున్నారని, టిడిపి అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మల్లికార్జున, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎల్‌బి నగర్ ధనుంజయ, మాజీ సర్పంచి నాగరాజుమోహన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పేదలకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు ప్రవాస భారతీయులు, తమ అన్న కల్లమడి రవీంద్రనాథ్, రమాదేవి కుమార్తె సుచరిత పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు కవిన్ ఆదిత్య, సుబ్రమణ్యం, ఓబులపతి, సుబ్బారావు, నబిరసూల్, కిష్టప్ప, రవికుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంకాలమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన

బెలుగుప్ప : మండలంలోని బెలుగుప్ప తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గిరిజనుల ఆరాధ్య దైవం కంకాలమ్మ దేవి విగ్రహాన్ని సోమవారం ఘనంగా ప్రతిష్టించారు. ఇందులో భాగంగా ఉదయమే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

రైతు వ్యతిరేకి జగన్‌ను గద్దెదించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న సిఎం జగన్‌ను గద్దె దించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. 'దేశాన్ని కాపాడండి-రాష్ట్రాన్ని రక్షించండి' అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్ర సోమవారం ఉరవకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అయినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా పోయిందన్నారు. ఎన్నికల ముందు సిఎం జగన్ తాను అధికారంలోకి వస్తే హంద్రీనీవా కాలువ డిస్ట్రిబ్యూటరీ పనులను పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీరందిస్తామని హామీ ఇచ్చి కనీసం ఎకరాకు ఇచ్చిన పాపానపోలేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు గతంలో కురిసిన అధిక వర్షాలకు కొట్టుకుపోయిందని, ఆ గేటు నిర్మించడానికి కూడా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అంతేగాకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ప్రజాప్రతినిధులు సొంత ఆదాయ వనరులను పెంచుకోవడానికి భూకబ్జాలు, ఇసుక మాఫియాలుగా ఏర్పడి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్నారు. స్వయంగా సిఎం జగన్ మద్యం అమ్మకాల్లో పెద్ద ఎత్తున కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఇకపోతే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తుండడంతో హిందూ, ముస్లింలు, క్రైస్తవుల మధ్య తగాదాలను సృష్టించి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జగదీష్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జాన్సన్‌బాబు, జిల్లా కార్యదర్శి జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్, రెగ్యులర్, ఎన్.ఎం.ఆర్, మలేరియా, కోవిడ్, గార్బేజ్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కార్పొరేషన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 11 నెలల పిఎఫ్ బకాయి ఇవ్వాలని, 60 సంవత్సరాల పేరుతో తొలగించిన కార్మికులు, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించాలని, అనారోగ్య, ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పిస్తూ ఈపీఎఫ్, ఈఎస్ఐ ద్వారా వచ్చే డెత్ బెనిఫిట్స్ వెంటనే ఇప్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేస్తూ రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు 2021వ సంవత్సరం జనవరి నెలలో 409 మంది కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయి ఉందని మరియు 2023వ సంవత్సరం ఏప్రిల్ నెలలో 409 మంది కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయి ఉందని, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న రెండు సంవత్సరాల సరెండర్ లీవ్ అమౌంట్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని, ఎన్ఎంఆర్ కార్మికులకు హెల్త్ అమలు చేయాలని, మలేరియా, కోవిడ్, గార్బేజ్ కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, యూనిఫాం, కుట్టుకూలీ, పనిముట్లు రక్షణ పరికరాలు మెనూ పద్ధతిలో సకాలంలో చెల్లించాలని, పెరిగిన నగర విస్తీర్ణం జనాభాకి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పందించి తమ పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనంతపురం ఓల్డ్‌టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, ఉపాధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, న్యూటౌన్ అధ్యక్షులు గురురాజా, మున్సిపల్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి సాకే.తిరుమలేష్, సహాయ కార్యదర్శి బత్తల ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు సాకే.లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, నగర కమిటీ సభ్యులు బంగ్లా రాఘవేంద్రప్రసాద్, నాగేంద్ర, హెచ్.నల్లప్ప, ముత్తురాజు, లక్ష్మీదేవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సూపరిం టెండెంట్ ఇంజినీర్ నాగమోహన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఐ నాయకులు

ఎంబిబిఎస్ సీట్లను అమ్మకానికి పెట్టడం దారుణం : టిడిపి

ప్రజాశక్తి-శింగనమల

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోని ఎంబిబిఎస్ సీట్లను అమ్మకానికి పెట్టడం చాలా దారుణమని బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజానికి దశ, దిశ నేర్పేది విద్య మాత్రమే అన్నారు. అలాంటి విద్యను అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీల్లోని సీట్లను అమ్మకానికి పెడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అత్యంత దుర్మార్గమైందన్నారు. కన్వీనర్ కోటాలో 50 శాతం, 35 శాతం సీట్లు సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో, ఎన్ఆర్ఐ కోటాలో మిగిలిన 15శాతం సీట్లు భర్తీ చేసేందుకు సిద్ధపడడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయంతో అధికంగా నష్టపోయేది బడుగు బలహీన వర్గాలే అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఎస్సీ విద్యార్థులు 48 సీట్లు, ఎస్టీ విద్యార్థులు 19, 93 సీట్లు నష్టపోతారన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకుని బడుగు బలహీన వర్గాలకు దమాషా ప్రకారం సీట్లు పొందేలా చూడాలని డిమాండ్ చేశారు.

7న చంద్రబాబు రాక

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు ఈ నెల 7వ తేదీ కళ్యాణదుర్గం వస్తున్నారని, ఈ పర్యటనను జయప్రదం చేయాలని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటి నాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వారు పాత్రికేయుల సమావేశంలో చంద్రబాబు పర్యటన వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వస్తున్న చంద్రబాబు 7వ తేదీ ఉదయం 10 గంటలకు రైతులతో ముఖా ముఖి కార్యక్రమంలో నిర్వహిస్తారని తెలిపారు. తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది వద్ద పనులు చేయకుండా వృథాగా వదిలేసిన మోటార్లు, పంపుల వద్ద సెల్ఫీ పాయింట్ నిర్వహిస్తారన్నారు. అక్కడి నుంచి నేరుగా వాల్మీకి సర్కిల్ చేరుకుని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి రోడ్‌షో చేపడతారన్నారు. అనంతరం టీ సర్కిల్‌లో ప్రజలనుద్దేశించి బహిరంగసభలో ప్రసంగిస్తారన్నారు. చంద్రబాబు పర్యటనలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : రిలయన్స్ డిజిటల్ పైన, 2వ ఫ్లోర్, సుభాష్‌రోడ్డు, క్లాక్‌టవర్ దగ్గర, అనంతపురం.
-వలీసాబ్ రోడ్, అరబిక్ రెస్టారెంట్ ఎదురు, కదిరి.
-లక్ష్మీబజార్, అనంతపురం మెయిన్‌రోడ్డు, ఎపిజిబి బ్యాంక్ దగ్గర, రాయదుర్గం.
-ఫస్ట్‌ఫ్లోర్, వాల్మీకి సర్కిల్, కళ్యాణదుర్గం.
-చలపతి ఎన్‌క్లేవ్, ఫస్ట్‌ఫ్లోర్, పరిగిల్ బస్టాప్ దగ్గర, హిందుపూర్
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2231.30 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ANANTHAPUR AREA CELL NO- 9966644110

పెద్దపప్పూరు ఎంపిపిగా రామిరెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల అధ్యక్షులుగా బొందలదిన్నె రామిరెడ్డి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈమేరకు ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో ఎంపిపిగా విధులు నిర్వహిస్తున్న రామ్మూర్తిరెడ్డి రాజీనామాతో చేయడంతో రామిరెడ్డి కొద్దిరోజులుగా ఇన్‌ఛార్జి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈనేపథ్యంలో పూర్తిస్థాయి ఎంపిపిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం సభ్యుడు వేమనాథరెడ్డి, అశ్వర్థం నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ, చిన్నబాబు, కోఆప్షన్ సభ్యుడు వలి, ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్, ఎంపిటిసిలు, సర్పంచులు హేమసుందర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చర్లపల్లి రామిరెడ్డి, చిన్నప్పూరు బాబు, తురకపల్లి లక్ష్మిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిపి రామిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

సమస్యలను గుర్తించి సమన్వయంతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ప్రభుత్వ వసతి గృహాలు, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యుత్ సమస్యలు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపై ప్రశ్నించారు. అలాగే ఈక్రాప్ బుకింగ్ చేయాలని, ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. ఇందుకు ఎంపిపి, జడ్పీటిసి స్పందిస్తూ ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ఈరమ్మ, వైస్ ఎంపిపి మోదుపల్లి సునీతా రామాంజనేయులు, ఐఒఆర్‌డి సత్యబాబు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి